# ఆవూ - సింహమూ - ఆపైన మనిషీ

"ఆవూ-పులీ అనే శీర్షికతో చాలా కథలొచ్చాయి. ఆవూ లేక మేకా, పులీ, పచ్చగడ్డీ అనే పొడుపు కథలూ ఉన్నాయి. ఆవూ - సింహమూ - మనిషి కథ ఎప్పుడైనా విన్నావా?"

"వినలేదు. కాని నువ్వు కథంటూ మొదలు పెట్టి కాకరకాయ కబుర్లు చెప్తావు!"

"నీతి అనేది కథ ద్వారానే తెలుసుకోవాలని ఎక్కడా లేదు! కాకరకాయ కబుర్ల ద్వారా కూడా తెలుసుకోవచ్చు!"

"సరే అఘోరించు!"

"ఆవు దంతములు పచ్చిక కొరికి తినుటకు అనువుగా నుండును. సింహపు కోరలు జంతువులను చీల్చి చెండాడుటకు ఉపయోగించును. కనుక ఆవు సాధు జంతువు. సింహము క్రూర జంతువు. సింహము పాలు సింహపు పిల్లలే త్రాగును. కాని ఆవు పాలు దూడలకు దక్కనీయక మానవులు త్రాగుదురు – ఏడో తరగతిలో ఉన్నప్పుడు ఓ వ్యాసరచన పోటీలో నేను వ్రాసిన కొన్ని వాక్యాలివి. మా మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేను వ్రాసిన దాన్ని క్లాసులో మెచ్చుకొని స్కూల్‌డే నాడు బహుమతినిచ్చారు."

"అంత చిన్నతనంలో అంత భావగర్భితమైన వాక్యాలు ఎలా వ్రాశావు?! నేను నమ్మను!"

"మా యింట్లో ఆవులూ, గేదెలూ ఉండేవి. లేగదూడల్ని పొదుగు దగ్గర చేర్చి, పాలు చేపుకు రాగానే పక్కకి లాగి పాలు పితికేవారు. అందుచేత నేను ప్రతి రోజూ చూసిందే వ్రాశాను. అంతకు మించి ఆలోచించలేదు. చాలా పెద్ద భావం ఉందని ఆలోచించి పొగిడింది హెడ్మాష్టరు. ఇన్నేళ్ళ జీవితం తర్వాత ఆ వాక్యాల్లోని భావం యిప్పుడిప్పుడే అర్థమౌతోంది."

"దూడలకు లేకుండా చేసిన పాలు త్రాగడానికి నీకు మనస్కరించేది కాదనుకొంటాను?"

"జ్ఞానం తెలిసిందగ్గర్నుంచీ నేను పాలు త్రాగలేదు. కాఫీయే తీసుకొనేవాణ్ణి. అసలు గ్లాసులతో పాటు త్రాగే అలవాటు మా యింటా వంటా లేదు. కాని ఏడాది పొడుగునా, రెండు పూట్లా పెరుగూ, మజ్జిగా లేందే మా భోజనాలు పూర్తి కావు!"

"అంటే దూడలకి లేకుండా చేసిన పాలతో చేసిన పానీయాలూ, ఇతర పదార్థాలు సేవించడానికి నీకు అభ్యంతరం ఉండేది కాదన్నమాట?"

"అన్నమాటే! 'దూడలకి లేకుండా చేసిన పాలు' అన్న నిజాన్ని గుర్తించానే కాని, అందులోని నైతికాంశాన్ని గురించి ఆలోచించలేదు. అలా ఆలోచించే శక్తి అంత చిన్న వయసులో నాకు లేదు".

"పోనీ యిప్పుడుంది కదా?"

"ఉందనుకో. కాని పెరుగో, మజ్జిగో లేకుండా నాకు భోజనం సహించదు. అందుచేత ఆవుని గురించీ, దూడని గురించి నేనిప్పుడాలోచించను. కాని ఉన్న నిజమేమిటంటే సింహం ఆవుని మాంసం కోసం చంపుతుంది కాని పాల కోసం కాదు. కాని మనిషి ఆవుని పాల కోసం జీవితాంతం పోషించి పీడించి, అటుపైన మాంసం కోసం చంపేస్తాడు!"

"డార్క్ సైడ్ లేనిదే ఏ విషయమూ ఉండదు. అయినా అదృష్టవంతుడివి, ప్రతి రోజూ గడ్డపెరుగు వేసుకొని భోంచేస్తున్నావ్!"

"అక్కడే పొరపాటు పడ్తున్నావ్! ఆకాశాన్నంటే ధరల మూలాన నెయ్యి వేసుకోవడం మానేసి పదేళ్ళు దాటింది. ఇంక పెరుగు సంగతంటావా, ఉన్న ఒక్క పిల్లకీ వెయ్యగా మిగిలిందేమైనా ఉంటే కాస్త విదిలిస్తుంది శ్రీమతి. లేకపోతే గిన్నె కడిగి మజ్జిగ నీళ్ళు పోస్తుంది. ప్రశ్నార్థకంగా చూస్తే 'ఇంకో లీటరు పాలు పోయించుకోనివ్వండి' అన్నట్లుగా చూస్తుంది. లీటరు పదహారు రూపాయల చొప్పున నెలకి అదనంగా సుమారు అయిదు వందలు ఖర్చు!"

"మీ ఊరు దగ్గరేగా. శని ఆదివారాల్లో వెళ్లి కావల్సిన వెన్నా, నెయ్యి తెచ్చుకోవచ్చు. ఏ బస్సు డ్రైవర్నో మంచి చేసుకొంటే ప్రతి రోజూ పాలు కూడా తెప్పించుకోవచ్చు!"

"తెప్పించుకోవచ్చు. కాని అక్కడ మాకిప్పుడు ఆవులూ, గేదెలూ లేవు!"

"ఏమైందని?"

"ఇంటి పశువులు ఆడవాళ్ళ సొత్తు. నాయనమ్మ సామ్రాజ్యంలో ఆవిడ బ్రతికుండగానే, మా పెద్దమ్మా, మా అమ్మా, మా పిన్నమ్మా అడుగు పెట్టడానికి ప్రయత్నించారు. నోరున్న నా కుర్ర పశువుల్ని కొంగున ముడేసుకొన్నా ఊరుకొన్నాను! కాని దొడ్లో ఉన్న మూగ పశువుల మీద కన్నేస్తే జాగ్రత్త!" అని నాయనమ్మ అందర్నీ చెడా మడా తిట్టింది!"

"అప్పుడు...?"

"మా అమ్మలు తిరుగుబాటు చేశారు. దాంతో వళ్ళు మండి నాయనమ్మ ముగ్గురత్తలకీ ఒక్కో ఆవూ, గేదే యిచ్చిపారేసి, చేతులు దులుపుకొంది!"

"మీరు మళ్ళీ కొనుక్కోలేకపోయారా?"

"ఆ గొడవ అంతటితో ఆగలేదు. మా నాన్నలు విడిపోవడం దాకా వెళ్ళింది. అద్దె కొంపల్లో జేరింతర్వాత ఆవులకీ, గేదెలకీ జాగా ఉండొద్దూ?"

"మీ పొలాల్లో ఉంచుకోవచ్చు కదా?"

"పొలాలా – యింకా ఎక్కడ కూర్చున్నాయని?! యింట్లో జరిగిన శుభకార్యాలకి ఎకరాల్ని హారతిచ్చేశాడు తాతయ్య! అసలింతకీ ఆవుల్ని మళ్ళీ ఎందుకు కొనుక్కోలేదన్న నీ ప్రశ్నకి సమాధానం చెప్పనేలేదు!"

"అద్దెకొంపల్లో ఉంచనియ్యరన్నావు"

"అంతేకాదు, ఆవుల్ని కొనడం సంగతటుంచి, నాకు కాలేజీ ఫీజు కట్టలేని పరిస్థితి కొచ్చేశాడు మా నాన్న, యితర బాధ్యతలు నెత్తి మీద పడడం వల్ల. అమ్మ అప్పుడప్పుడూ వంటి మీదనున్న బంగారాన్ని వలిచిపెట్టి ఎలాగో మా చదువుల్ని గట్టెక్కించింది. అందుచేత, నేను కాఫీ టీలతో పాటు రెండూ పూట్లా గడ్డ పెరుగు కూడా వేసుకోడానికి మరో లీటరు పాలు పోయించుకుంటే, మా అమ్మ పేర నేను నెల నెలా పంపగలిగే పదిహేను వందల్లోనూ అయిదు వందలు తగ్గించాలి.

అందుకని మజ్జిగతోనే సరిపెట్టుకొంటున్నాను".

"పశు సామ్రాజ్యాన్నేలిన మీ నాయనమ్మ ఖాళీ దొడ్డిని ఎలా భరించింది?"

"మా నాయనమ్మ సంగతి నీకు తెలియదు. మా ముగ్గురత్తల కూతుళ్ళనీ తన చివరి ముగ్గురు కొడుకులకీ యిప్పించి పెళ్ళిళ్ళు చేయించింది ఏణ్ణర్థం తిరక్కుండానే! భరణంగా, వెళ్ళిన పశువులు తిరిగొచ్చాయి! మా అమ్మలకి ఉడుకుమోత్తనం వచ్చి ఓ సారి పాడి పశువుల్ని కొనడానికి ప్రయత్నం చేశారు. ఆకాశాన్నంటే ధరలు చూసి నీరసపడి పోయారు. అసలు దీనికంతటికీ కారణం మా తాతయ్య!"

"పాపం ఆయనేం చేశాడని? ఎకరాలమ్మాడని కోపమా?"

"కాదు, వాత్సాయన కామసూత్రాలు చదివి సుఖంగా సంసారం చేసి, ఆరుగురు కొడుకుల్నీ, ముగ్గురు కూతుళ్ళనీ కన్నాడు! యింట్లో జరిగిన ఘర్షణల మాటటుంచి చూస్తే, పాడిపశువుల సంఖ్య ఎప్పుడూ ఆరింటికి మించలేదు. వట్టిపోవడం, రోగాలతో చావడం, గిత్తలు పుట్టడం లాంటి కారణాలతో పాలిచ్చే పశువుల సంఖ్య విపరీతంగా వృద్ధి పొందడానికి అవకాశం లేదు. కాని కుటుంబ సభ్యుల సంఖ్యో?"

"అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు మరి మీ నాన్న; పెదనాన్నా, బాబయ్యలూ...?"

"మా పెదనాన్న వేమన పద్యాలు కూడా చదివాడు. ఆరుగురు పిల్లల్ని కన్నతర్వాత జీవితం మీద విరక్తి పుట్టి సన్యాసుల్లో కలిసిపోయాడు. ఆ సంసారాన్ని నలుగురూ నాలుగు చేతులు వేసి లాగిస్తున్నాం. మా నాన్నా, చిన్నాన్నా సంజయ్‌గాంధీ చలవ వల్ల, ముగ్గురేసితో బయటపడ్డారు. మిగిలిన ముగ్గురు చిన్నాన్నలకీ ప్రస్తుతానికి ఒక్కొక్కరు. నువ్వడిగావని కోపం లేదు. పిల్లలు దైవ ప్రసాదాలని నిశ్చితంగా ముందు చూపు లేకుండా సంసారాల్ని కొనసాగించే తాతయ్య లాంటి వాళ్ళు చాలా మంది ఉన్నారు. అందుకనే జనాభా పెరిగిపోతోంది. తను సంపాదించిన ఆస్తి తరిగిపోతుందని చింతన ఉన్నా లేకపోయినా, పుట్టించిన సంతానం సంఘానికీ, భూమికీ అదనపు బరువు బాధ్యతలని పెంచుతుందని మట్టుకు ఆలోచించాలి. అందుకనే మనం ప్రస్తుతం చర్చిస్తున్న విషయాన్నే తీసుకొంటే, రాను రానూ, ప్రజల సంఖ్యకీ, పాలిచ్చే పశువుల సంఖ్యకీ పొత్తు లేకుండా పోతుంది. పోను పోనూ ఈ పరిస్థితి యిలాగే ఉంటే, లీటరు పాలు వంద దాటడానికి ఎంతో సమయం పట్టదు! అందుకని..."

"అందుకని?"

"మాకున్న ఒక్క కూతురు చాలు! వచ్చే ఆదివారం వేసక్టమీ ఆపరేషన్‌కి వెడ్తున్నాను!"

"ఈ మాట చెప్పడానికా, యింత ఉపోద్ఘాతమూను?!"

"కాదు. నీకు యిప్పటికే ఓ కొడుకూ, కూతురూను. నాతో పాటు నిన్నూ తీసుకెడ్దామనే ఈ ఉపోద్ఘాతం!"

"ఆఁ.... అలాగా?..... అలాగే!"

**ఉపసంహారం :** "ప్రజల సంఖ్యతో పోలిస్తే, సింహాల సంఖ్య కన్నా పాడి పశువుల సంఖ్య చాలా చాలా మెరుగు. మరి క్షీణిస్తున్న సింహాల సంఖ్యని గురించి ఏం చేద్దాం?"

"ఉచ్ఛ జన్మల్ని మేం నియంత్రణలో ఉంచదల్చుకొన్నాం. అందుకని జీవుళ్ళను వన్య మృగ విస్తారణకు మళ్ళించమని బ్రహ్మదేవుడికి మెమొరాండం పంపిద్దాం!" ●